22100511

International Baccalaureate®
Baccalauréat International
Bachillerato Internacional

**TELUGU A1 – STANDARD LEVEL – PAPER 1**
**TÉLOUGOU A1 – NIVEAU MOYEN – ÉPREUVE 1**
**TELUGU A1 – NIVEL MEDIO – PRUEBA 1**

Thursday 13 May 2010 (afternoon)
Jeudi 13 mai 2010 (après-midi)
Jueves 13 de mayo de 2010 (tarde)

1 hour 30 minutes / 1 heure 30 minutes / 1 hora 30 minutos

---

INSTRUCTIONS TO CANDIDATES

- Do not open this examination paper until instructed to do so.
- Write a commentary on one passage only. It is not compulsory for you to respond directly to the guiding questions provided. However, you may use them if you wish.

INSTRUCTIONS DESTINÉES AUX CANDIDATS

- N'ouvrez pas cette épreuve avant d'y être autorisé(e).
- Rédigez un commentaire sur un seul des passages. Le commentaire ne doit pas nécessairement répondre aux questions d'orientation fournies. Vous pouvez toutefois les utiliser si vous le désirez.

INSTRUCCIONES PARA LOS ALUMNOS

- No abra esta prueba hasta que se lo autoricen.
- Escriba un comentario sobre un solo fragmento. No es obligatorio responder directamente a las preguntas que se ofrecen a modo de guía. Sin embargo, puede usarlas si lo desea.


© International Baccalaureate Organization 2010

*క్రింది వాటిలో ఒక దానికే వ్యాఖ్యానం రాయండి.*

**1.**

## 'చుక్కమ్మ'

చుక్కమ్మ లేని సమయం చూసి గంగ నూకరాజుతో గుసగుసలాడింది. "మీ అయ్య ఏదో మాటవరసకన్న మాట పట్టుకుని చుక్కమ్మకి ఆ మూడు సెంట్ల బూమి ఇయ్యాల్సిన పనిలేదని అపుడన్నానుగానీ ఇపుడు ఇవ్వక తప్పదనిపిస్తంది. తాకట్టు లేకుండా పైసా అయినా ఇదిలించని బట్టల కొట్టు బద్రయ్య మనకి ముప్పైవేలు అప్పు పెడతానన్నాడు. ఆళ్ళది అన్నదమ్ముల జాయింటు యాపారంగా ... ఈ డబ్బు బద్రయ్య ఒక్కడిదేనంట. అందుకే మనకిత్తానన్నాడు. వడ్డీక్కూడా కరాకండీ లేదన్నాడు. రేపే తీసుకుని చుక్కమ్మకిచ్చి పంపించేద్దాం". చుక్కమ్మ వచ్చిన సడి విన్న గంగ మాటలు ఆపేసింది.

"ఏటొదినా ... అన్నతో ఆలోచన సేస్తన్నావ్?" చుక్కమ్మ యథాలాపంగా అడిగింది.

గంగ నిట్టూర్చింది. "మీ ఆలుమగల్ని ఇడదీసిన పాపం మనకెందుకూ ... చుక్కమ్మకి డబ్బిచ్చి పంపిద్దామని సెబుతున్నా. ఆ బూమి తాకట్టు పెట్టి డబ్బు తెద్దామంటున్నా".

చుక్కమ్మ మొహం వెలిగిపోయింది. ఆనందంగా "నిజమా...?" అంది. గంగ చివరి మాటల్ని విన్న చుక్కమ్మ వదిన మాటమార్చి చెప్పినందుకు మనసులోనే నవ్వుకుంది. ఎలాగైతేనేం తనకి సర్దుబాటు చేయటమే ముఖ్యం కదా అనుకుంది.

చిలకపచ్చ రంగు చీరె కట్టుకుని, చంటిగాడి చేయి పట్టుకుని మొహమంతా నవ్వు పులుముకుని తనింటివేపు అడుగులు వేస్తున్న చుక్కమ్మని చూసిన సూరమ్మ పలకరించి విషయం తెలుసుకుంది. సంతోషించింది.

"గంగమ్మ ఎగనామం పెట్టే బాపతేకానీ మీ అన్నతో డబ్బు ఇప్పిస్తాదని అనుకోలేదే" అంది సూరమ్మ.

"ఏదో కాస్త ఆలీశం అయిందంతేగానీ ఆడపిల్ల సొమ్ము ఆళ్ళెందుకివ్వరూ?" అంది చుక్కమ్మ.

"నిజవే. ఈ మాత్రం దానికి అనవొసరంగా బీముడు నోరు పారేసుకున్నాడు... తప్పే"

"ఏటి తప్పు? ఏడేళ్ళుగా నానుస్తుంటే కష్టమేసి ఓ మాటనరా?"

సూరమ్మ విస్తుపోయింది. "ఏటే, ఇటంటే అటంటన్నావ్ ... అటంటే ఇటంటన్నావ్?"

"అటూ ఇటూ కావల్సినవోళ్ళేగా. పుట్టింటోళ్ళకి కష్టం కలక్కూడదు ... కట్టుకున్నోడికీ నష్టం రాకూడదు. అవునా?" అంది చుక్కమ్మ చిరునవ్వుతో.

సూరమ్మ కూడా నవ్వింది. "మొత్తానికి మా బీముడు బాగానే వసూలు చేసుకున్నాడు. మేం అనుకున్నంత మెత్తనోడేం కాదు" అంది.

చుక్కమ్మ ఏం మాట్లాడకుండా ఒక క్షణం మౌనంగా ఉండిపోయింది. రెండడుగులు ముందుకు వేసినదల్లా వెనక్కి

తిరిగి “పిన్నమ్మా”... అంటూ సూరమ్మని పిలిచింది. ఏమిటన్నట్లుగా చూసింది సూరమ్మ.

సంశయిస్తున్నట్లుగా నిలబడిన చుక్కమ్మ నసుగుతూ మెల్లగా చెప్పింది. “నువ్వు అమ్మలాటిదానివి ... నీకు నిజం చెప్పకపోవటమేమిటని చెబుతున్నా. మావోడు నిజెంగా దరమరాజులాటోడే! ఆడికేం తెలవదు. అన్న ఇయ్యాల్సిన డబ్బు గురించి ఎపుడూ ఒక్కమాటని ఎరగడు. కానీ మా అత్త ఊరునుండి వచ్చినపుడల్లా ‘నూకరాజు డబ్బిచ్చాడా?’ అనడుగుతాది. లేదని తలూపుతాడంతే.

‘ఆడపిల్ల సొమ్ముకు ఆశపడ్డవాడెవడూ బాగుపడడు. అందుకే నాలుగు రకాల యాపారాలు సేత్తన్నాగానీ నూకరాజు ఎందులోనూ పైకి రాటంలేదు. సూది కోసం సూసుకుంటే దబ్బనం పోతాదని తెలుసుకోరు’ అంటూ శాపనార్థాలు పెడతాది. నా మనసు గిలగిల్లాడిపోతది. అందుకే ... అందుకే... ” చుక్కమ్మ గొంతు బొంగురుపోయింది. క్షణం ఆగి మళ్ళీ చెప్పింది. “తోడబుట్టినోడు పదికాలాలపాటు పచ్చగా ఉండాలనే కదా, ఏ ఆడపిల్లయినా కోరుకుంటాది. మా అత్త శాపాలు తగిలి మా అన్న యాపారంలో పైకి రాడేమోననే బయం పట్టుకుంది. అందుకే ఆడు తాగొచ్చినరోజు ... ఏదో మాటంటే నేను కావాలనే పెడర్థం తీసి... ఆడిమీద వంకపెట్టి యాగీ చేశాను. అన్న ఇంటిమీద కూర్చుని వసూలు చేసుకొచ్చాను. ఇదంతా నేను చేసిందే పిన్నమ్మా. పాపం ఆడికేం తెలవదు. అటేపుకి రావద్దని నేనే కబురెట్టాను. అందుకే ఆడూ అక్కడికి రాలేదు” చుక్కమ్మ కళ్ళు తుడుచుకుంది.

సూరమ్మ తడి కళ్ళతో విస్తుపోయి చూసింది. “చుక్కమ్మా, నీది నిజంగా బంగారమంటి మనసే” అంది. చుక్కమ్మ నిట్టూర్చింది. జాతరలో పోయిందని చెప్పిన గొలుసమ్మి ఎవరికీ చెప్పొద్దని బద్రయ్య దగ్గర మాట తీసుకుని తన డబ్బే అన్నకి అప్పుగా ఇప్పించిందనే సంగతి మాత్రం ఎవరికీ తెలవకూడదు. అన్న బాకీ తీర్చగలిగితే తన సొమ్ము వస్తుంది. లేకపోయినా పర్లేదు. నగ ఒంటిమీదుంటే మెరుపొస్తాది. తన బంగారం బంధుత్వానికి మెరుగిచ్చేందుకు ఉపయోగపడింది. అది చాలు... తృప్తిగా అనుకుంది మనసులోనే చుక్కమ్మ.

*చుక్కమ్మ*, గోగినేని మణి. *ఈనాడు ఆదివారం*, జూన్ 29, 2008. పేజి:14

– ఈ సంగ్రహంలోని విషయ ప్రాధాన్యతను రచయిత వాడిన భాష ఎలా పెంపొందింపజేసిందో చర్చించండి?

– ఈ సంగ్రహంలో వివిధ స్త్రీ పాత్రల ఆవిష్కరణపై వ్యాఖ్యానించండి?

– కథన రీతులను రచయిత ఎలా ఉపయోగించాడో చర్చించండి?

– ఈ సంగ్రహంలో ప్రధాన ఇతివృత్తాలు ఏ విధంగా ఆవిష్కరింపబడ్డాయో వ్యాఖ్యానించండి?

**2.**

# ‘అతనొక్కడే’

అతనొక్కడే
మట్టికి మాటలు నేర్పుతూ
మట్టితో మాట్లాడుతూ
మట్టికి ఆకలి తీర్చే
మంత్రాన్ని ఉపదేశిస్తున్నాడు
అందరూ నగరాలకెళ్లిపోయి
బృందావనంలో విహరిస్తుంటే
అతనొక్కడే మహారుషిలా
మట్టికోసం యజ్ఞం చేస్తున్నాడు
గొప్ప శాస్త్రవేత్తలా
మట్టిలోంచి అన్నం సృష్టిస్తున్నాడు
పండగ పూట కూడా
పచ్చని రవిక దిక్కులేని భార్యతో,
రెండు పూటల తిండికీ
చదువుకీ నోచుకోని పిల్లలతో
బతకడం కోసం
జీవితాన్ని ముందే అమ్మేసుకుని
ఇతనొక్కడే ఊరికి దూరంగా
వల్లకాడికి దగ్గరగా
ఒంటిరిగా!

బండి సత్యనారాయణ, ‘అతనొక్కడే’. సాహితీ, ఆంధ్ర భూమి ఆన్ లైన్ పత్రిక (జూన్ **2009**) నుంచి

– కవితలోని ప్రధాన వస్తువు ఆవిష్కరణలో సాహితీ ప్రక్రియలు ఎలా ప్రయోగింపబడ్డాయో చర్చించండి?

– కవితలోని నేపథ్యం మీ అవగాహనకు ఏ విధంగా దోహదపడిందో వివరించండి?

– రచయిత వాడిన భావజాలం, దాని ప్రభావంపై చర్చించండి?

– ఒక పాఠకుడి ఆలోచనలను, అనుభూతులను ఈ కవిత ఎలా స్పందింపజేస్తోందో వివరించండి?